సాక్షి
జగిత్యాల
శుక్రవారం। 7। జూలై। 2023





## కొండపై పూజలు

కొండగట్టు : తెలంగాణ సోషల్ మీడియా కన్వీనర్ దినేశ్‌చౌదరి గురువారం కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.



## ఆర్డీవోకు సన్మానం

కోరుట్ల: కోరుట్లలో విధులు నిర్వహించి ఆర్మూర్ ఆర్డీవోగా బదిలీపై వెళ్తున్న వినోద్ కుమార్‌ను సీనియర్ సిటిజన్లు సన్మానించారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

## వాతావరణం

ఆకాశం దట్టమైన మేఘాలతో కమ్ముకుని ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నృసింహునికి పూజలు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని మహాగణపతి సన్నిధిలో గురువారం సంకష్టహరహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముత్యాల శర్మ మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### వ్యాధులపై అప్రమత్తం



జగిత్యాలటౌన్/జగిత్యాలజోన్: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా జిల్లా పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పెంపుడు జంతువులతో సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో గురువారం పెంపుడు కుక్కలకు ఉచిత వైద్యపరీక్షలు చేశారు. యాంటి రేబిస్ టీకాలు వేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ పెంపుడు జంతువులు మానవ జీవితంలో భాగమన్నారు. వాటినుంచి సంక్రమించే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మకరంద్, జిల్లా పశువైద్యాధికారి గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ నరేశ్, జిల్లా వైద్యాధికారి శ్రీధర్, కౌన్సిలర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

### మురుగునీరు తొలగించాలని ధర్నా



రాయికల్(జగిత్యాల): స్థానిక మాదిగకుంటలోని మురుగునీరు తొలగించాలనే డిమాండ్‌తో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం ధర్నా చేశారు. సుమారు 2 గంటల పాటు రోడ్డుపై బైఠాయించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి మాట్లాడుతూ, మాదిగకుంటలోని మురుగునీటితో సమీపంలోని బోర్లు, బావుల్లో నీరు కలుషితమవుతోందన్నారు. కుంట నుంచి వెలువడే దుర్వాసనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే మురుగునీరు తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీసులు, ఏఈ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని నీటిని తొలగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఏఈకి వినతిపత్రం అందజేశారు. నాయకులు శ్రీకాంత్, కుర్మ మల్లారెడ్డి, ఆశన్న, భూమేశ్, మచ్చ నారాయణ, సతీశ్ పాల్గొన్నారు.

### శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



జగిత్యాలటౌన్: జనసంఘ్ వ్యవస్థాపకుడు, హిందూ జాతీయవాద నేత శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ కార్యాలయంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యుడైన శ్యాంప్రసాద్‌ముఖర్జీ జనసంఘ్ పార్టీని స్థాపించి ఆధునిక హిందుత్వ జాతీయవాద వ్యాప్తికి విశేష కృషి చేశారన్నారు. నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మదన్‌మోహన్, దశరథరెడ్డి, భూమి రమణ, వీరబత్తిని అనిల్‌కుమార్, జుంబర్తి దివాకర్, డాక్టర్ ప్రవీణ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

### నేటి నుంచి ఉచిత బియ్యం

జగిత్యాలరూరల్: జిల్లాలోని రేషన్ దుకాణాల ద్వారా పేద కుటుంబాలకు ఈనెల 7వ తేదీ నుంచి ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్ గురువారం తెలిపారు. రేషన్ డీలర్లు నిబంధనలు పాటిస్తూ బియ్యం పంపిణీ చేయాలని ఆయన సూచించారు.

# వైద్యులు ఉన్నా.. లేనట్టే..!

సాక్షి విజిట్

సమయపాలన పాటించని డాక్టర్లు



ఇది జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని స్కానింగ్ విభాగం. ఉదయం 11.45 గంటలైనా వైద్యులు రాలేదు.



ఇది కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. ఇందులో 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలి. కానీ, వైద్యులు సకాలంలో విధులకు హాజరు కాలేదు. పేషెంట్లు ఇలా నిరీక్షిస్తున్నారు.



ఈమె పేరు పుష్ప. స్వగ్రామం దమ్మన్నపేట. గురువారం ఉదయం 9గంటలకు జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చేరుకుంది. ఓపీలో చీటీ రాయించుకుని డాక్టర్ గదికి వెళ్లింది. అప్పటికీ ఎవరూ విధుల్లోకి రాలేదు.



ఇది జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని ఓపీ విభాగం. ఉదయం 11.30 గంటలైనా వందల మంది పేషెంట్లు బారులు తీరే ఉన్నారు.



ఇది సారంగాపూర్‌లోని 24 గంటల పాటు సేవలు అందించే ఆస్పత్రి. బీర్‌పూర్‌లోని పేషెంట్లు కూడా ఇక్కడికే వస్తున్నారు. ఒక్కరే డాక్టర్ ఉండడంతో పేషెంట్లకు సకాలంలో వైద్యసేవలు అందడంలేదు.

- నిరుపయోగమైన బయోమెట్రిక్ యంత్రాలు
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సిబ్బంది
- ఉద్యోగుల కొరతతో పేషెంట్లకు అందని వైద్యం
- జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో దుస్థితి ఇదీ..

జగిత్యాల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు సత్వరమే అందించాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేస్తున్నా క్షేత్రస్థాయిలో వైద్యం అందని ద్రాక్షగానే మారింది. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు ఉన్నా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. ఇక్కడ బయోమెట్రిక్ యంత్రం పనిచేయడం లేదు. దీంతో డాక్టర్లు విధులకు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదు. జిల్లాలోని పలు ఆస్పత్రులను 'సాక్షి' గురువారం విజిట్ చేయగా వైద్యులు సమయపాలన పాటించడం లేదని తేలింది. ఇదేమిటని ఆరా తీస్తే.. డాక్టర్లు ఇప్పటివరకూ పేషెంట్లకు సేవలు అందించారని, ఇప్పుడే రౌండ్స్‌కు వెళ్లారని సిబ్బంది సర్దిచెప్పడం గమనార్హం.

**రోజూ వెయ్యి మంది పేషెంట్లు..**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ దాదాపు వెయ్యి మందికిపైగా అవుట్ పేషెంట్లు వస్తున్నారు. సుమారు 200 మందికిపైగా ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. సరిపడా మందులు లేవు. వైద్య పరికరాలు, వస్తువులు కూడా లేవు. డాక్టర్లు రాసే మందుల్లో సగం మాత్రమే ఆస్పత్రిలో లభిస్తున్నాయి. మిగతావి బయట అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

### ఆస్పత్రుల సమాచారం

- జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో 42మంది సీనియర్ రెసిడెన్సీలు, 77 మంది వైద్యులు ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు విధులు నిర్వర్తించాలి.
- కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్‌లో వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు ఉన్నాయి. ఇవి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది.
- జిల్లాలో 17 పీహెచ్‌సీలు ఉండగా ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేయాల్సి ఉంది.
- జిల్లాలో 24గంటల పాటు వైద్యసేవలు అందించే పీహెచ్‌సీలు సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కథలాపూర్, కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి మండల కేంద్రాల్లో ఉన్నాయి.

### చర్యలు తీసుకుంటాం

ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు చేసేందుకు బయోమెట్రిక్ మిషన్లు ఉన్నాయి. సకాలంలో విధులకు హాజరు కాని డాక్టర్లపై చర్యలు తీసుకుంటాం.

– రాములు, సూపరింటెండెంట్, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి

**పీహెచ్‌సీల్లోనూ ఇదే దుస్థితి..**

జిల్లాలోని పీహెచ్‌సీల్లోనూ సరిపడా సిబ్బంది లేరు. పేషెంట్లకు మెరుగైన వైద్యం అందడం లేదు. 24 గంటల పాటు వైద్య సేవలు అందించే ఆస్పత్రుల్లో ఇద్దరికి ఒక్కరే డాక్టరు ఉంటున్నారు. స్టాఫ్‌నర్స్‌లు, అటెండర్లు లేరు. మందులు అందుబాటులో ఉన్నా.. సిబ్బంది లేక మూలనపడి ఉంటున్నాయి.

- కోరుట్ల వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, పిల్లల వైద్య నిపుణులు లేరు. అక్కడి పేషెంట్లు జగిత్యాల ఆస్పత్రికి రావాల్సిన దుస్థితి నెలకొంది.
- రాయికల్‌లోనూ వైద్యులు సమయపాలన పాటించడం లేదని, ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తున్నారని పేషెంట్లు ఆరోపిస్తున్నారు.
- ధర్మపురిలోనూ రెగ్యులర్ వైద్యులు లేరు. డెప్యుటేషన్‌పై వైద్యులు వచ్చిపోతున్నారు.
- ఇక్కడి ఆస్పత్రిని 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేసినా సరిపడా సిబ్బందిని నియమించలేదు.



ఇది కోరుట్లలోని సామాజిక ఆస్పత్రి. ఆర్థోపెడిక్, పిల్లల వైద్యులు లేరు. ఎక్స్‌రే యంత్రం అందుబాటులో లేదు. మౌలిక వసతులూ కరువయ్యాయి. పేషెంట్లు జగిత్యాలకు రావాల్సి వస్తోంది.



నిరంతరం వైద్యసేవలు అందించే మల్లాపూర్‌లోని ఆస్పత్రి ఇది. పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది లేరు. గురువారం ఉదయం 9 గంటలకు మంత్రి హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల ఉద్యోగులతో మాట్లాడారు. దీంతో సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరయ్యారు.

## బంగారు పతకం అందుకున్న యువతి



బంగారు పతకం అందుకుంటున్న వినీల

జగిత్యాలరూరల్: బాలపల్లి గ్రామానికి చెందిన కోటగిరి వినీల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి బంగారు పతకం అందుకున్నారు. వినీల కర్నాటక రాష్ట్రం ముద్దనవల్లిలోని శ్రీసత్యసాయి యూనివర్సిటీలో డిగ్రీ చదువుతూ అత్యంత ప్రతిభ కనబర్చారు. ఈనెల 3న యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో ద్రౌపది ముర్ము నుంచి డిగ్రీ పట్టాతో పాటు బంగారు పతకం అందుకున్నారు. అదే విశ్వవిద్యాలయంలో ఉద్యోగం కూడా సాధించారు. వినీలను గురువారం పలువురు అభినందించారు.

## సీఎమ్మార్ అప్పగించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: రైస్ మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని మరఆడించి ప్రభుత్వానికి సీఎమ్మార్ అప్పగించడంలో పురోగతి తక్కువగా ఉందని, వెంటనే బియ్యం అందించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సీఎమ్మార్‌పై అధికారులతో గురువారం తన కార్యాలయంలో సమీక్షించారు. 2022–23 వానాకాలంలో 2,26,585 మెట్రిక్ టన్నుల సీఎమ్మార్ ఇవ్వాల్సి ఉండగా కేవలం ఇప్పటిరకు 34,809 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారని కలెక్టర్ తెలిపారు. రా, బాయిల్డ్ రైస్‌మిల్లర్లు కచ్చితంగా బియ్యం అప్పగించాలని సూచించారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లోపు లక్ష్యం పూర్తిచేయాలన్నారు. ఎఫ్‌సీఐ అధికారులు గోదాముల్లో అవసరమైన స్థలాన్ని అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

**సకాలంలో చేరుకోవాలి**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 8న నిర్వహించనున్న టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. అభ్యర్థుల కోసం జిల్లాలోని నాచుపల్లి కొండగట్టు జేఎన్‌టీయూలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు రెండు సెషన్లలో పరీక్ష ఉంటుందని కలెక్టర్ యాస్మిన్ బాషా వివరించారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఎస్పీ భాస్కర్ ఆదేశాలు



చెక్కు అందజేస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ భాస్కర్ అభయం ఇచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ వెంకటరమణాచారి కుటుంబానికి పోలీసు భద్రత పథకం కింద మంజూరైన రూ.16 లక్షల చెక్కును జిల్లాపోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం అందజేశారు. వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏవో అమర్‌నాథ్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పోలీసులకు అభినందన**

విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఎంటీవో కానిస్టేబుల్ రైటర్ సత్యనారాయణను ఎస్పీ భాస్కర్ గురువారం అభినందించారు. పోలీసు మోటారు ట్రాన్స్‌పోర్ట్ ఫ్లీట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఎఫ్ఎంఎస్) నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్ఐ, కానిస్టేబుల్‌కు డీజీపీ కమాండేషన్ ఇటీవల అవార్డులు ప్రకటించింది.

**బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి**

ధర్మపురి: పోలీసు సిబ్బంది, అధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎస్పీ భాస్కర్ ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఠాణాకు వచ్చిన బాధితులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని గదులు, సీఐ, ఎస్సై రూములు, రిసెప్షన్ కౌంటర్, ఠాణా భవన భాగం పరిశీలించారు. అనంతరం కేసుల రికార్డులు పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ.. వివిధ సమస్యలతో బాధపడుతూ పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి ఫ్రెండ్లీ పోలీసులుగా వ్యవహరించాలన్నారు. సమయపాలన ముఖ్యమన్నారు. నేరాలు, కేసుల నమోదు విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీఐ రమణమూర్తి, ఎస్సై దత్తాత్రి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.4వేల పింఛన్



జగిత్యాలజోన్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వృద్ధులు, వితంతవులు, ఒంటరి మహిళలు, బీడీ, గీత కార్మికులకు ప్రతినెలా రూ.4వేల పింఛన్ చెల్లిస్తామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి రమేశ్‌బాబు హామీ ఇచ్చారు. లక్ష్మీపూర్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేయబోయే పథకాల గురించి డోర్ టు డోర్ ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ, యువకులు ఉపాధి పొందేందుకు యూత్ కమిషన్ ఏర్పాటు చేయడంతోపాటు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాన్ని అందిస్తామని చెప్పారు. రైతు భరోసా కింద రైతులతోపాటు కౌలు రైతులకు కూడా ఎకరాకు రూ.15 వేలు సాగు ఖర్చు అందిస్తామని చెప్పారు. రైతు కూలీలను సైతం రైతుబీమా పథకంలోకి తీసుకవస్తామని అన్నారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి సామ్రాట్ వంశీ, అధ్యక్షుడు గుండా మధు, నియోజకవర్గ ఇన్‌చార్జి తీపిరెడ్డి బాపురెడ్డి, నాయకులు స్వామిరెడ్డి, మహేశ్, రాజిరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

# డామిట్.. కథ అడ్డం తిరిగింది!

- పరీక్ష సమయంలో మొరాయించిన మైక్రోఫోన్
- మధ్యలోనే నిలిచిపోయిన డేటా ట్రాన్స్‌ఫర్?
- ఇద్దరు లెక్చరర్ల సాయంతో హైటెక్ కాపీయింగ్
- తాజా అరెస్టులతో మరోసారి తెరపైకి వ్యవహారం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి కరీంనగర్‌కు ఉన్న లింకులు తవ్విన కొద్దీ వెలుగుచూస్తునే ఉన్నాయి. తాజాగా ఇద్దరు ప్రైవేటు కాలేజీ లెక్చరర్ల అరెస్టుతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఇటీవల హైటెక్ కాపీయింగ్‌కు సంబంధించిన వ్యవహారం వెలుగుచూసిన సమయంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కరీంనగర్‌లోని బొమ్మకల్ గ్రామానికి వచ్చిన సంగతి తెలిసిదే. తాజాగా మరోసారి సిట్ అధికారులు కరీంనగర్‌కు వచ్చారు. జిల్లాలోని ఇద్దరు ప్రైవేటు కాలేజీ లెక్చరర్ల పాత్రపై ఆధారాలు లభించడంతో వీరిని కూడా సిట్ అధికారులు అరెస్టు చేశారు. వాస్తవానికి ఈ వ్యవహారంలో వీరిద్దరూ సాయపడ్డారనే ఆరోపణలపైనే సిట్ అధికారులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.

**ఏంజరిగింది?**

వాస్తవానికి ఇద్దరు ప్రైవేటు కాలేజీ లెక్చరర్లకు డీఈ రమేశ్‌తో ముందే పరిచయం ఉంది. పరీక్షరాసే అభ్యర్థుల నుంచి రూ.75 లక్షలకు రమేశ్ ఒప్పందం చేసుకున్నాడన్న ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే కరీంనగర్ నుంచి కొందరితో రమేశ్ అవగాహన కుదుర్చుకున్నాడు. తాను ఒప్పందం చేసుకున్న వారు పరీక్ష రాసేచోట అతని సన్నిహితులైన లెక్చరర్లు సహకరించేలా ముందే రూ.5 లక్షల చొప్పున చెల్లించాడని ప్రచారం జరుగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వీరిద్దరూ రమేశ్ సూచించిన అభ్యర్థులను సరిగా తనిఖీ చేయకుండా.. హైటెక్ డివైజ్‌లు, శక్తిమంతమైన మైక్రోఫోన్‌లతో లోనికి వెళ్లేలా సహకరించారు. కానీ.. ఆరోజు వీరు సహకరించిన అభ్యర్థులు డివైజ్‌లు మధ్యలోనే మొరాయించాయని, సరిగా డేటా ట్రాన్స్‌ఫర్ కాక వాళ్లు పరీక్ష క్వాలిఫై కాలేదని ప్రచారంలో ఉంది. ఇందులో వాస్తవమెంత ? అన్న దానిపై ప్రత్యేక దర్యాప్తు బృందం దృష్టి సారించిందని సమాచారం.

**అప్పుడు ఆధారాలు లభించలేదా?**

బొమ్మకల్‌లో మాజీ ఎంపీటీసీ కూతురును అరెస్టు చేయడానికి గత జూన్ మొదటివారంలోనే సిట్ అధికారులు యత్నించారు. ఈ క్రమంలోనే మాజీ ఎంపీటీసీ కుటుంబం గ్రామం నుంచి పరారైంది. ఆ సమయంలోనే ఈ ఇద్దరు లెక్చరర్లను సిట్ ఎందుకు విస్మరించింది? అన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. లెక్చరర్లు సహకరించిన అభ్యర్థులు ఫెయిల్ కావడంవల్లే వీరిపాత్ర ఆలస్యంగా వెలుగుచూసిందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. సిట్ తొలుత పరీక్షల్లో మంచి మార్కులతో పాస్ అయిన అభ్యర్థులపై దృష్టి సారించిందని.. కానీ.. రమేశ్ బ్యాంకు లావాదేవీల ఆధారంగా ఇపుడు వీరిద్దరి పాత్ర వెలుగుచూసిందని ప్రచారం జోరుగా సాగుతోంది.

# పేదల పాలిట పెన్నిధి సంజయ్







సంజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ కవిత, మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబురాలు చేస్తున్న నాయకులు

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

జగిత్యాల: జన హృదయ నేత, జగిత్యాల అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక క్యాంప్ కార్యాలయంలో గురువారం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. అన్నపూర్ణ సేవా ట్రస్ట్‌కు రాగిజావ అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రముఖుల అభినందనలు**

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను సంజయ్ కలిశారు. వారు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# నల్లపోచమ్మకు బోనం మొక్కులు



కోరుట్లరూరల్: మోహన్‌రావుపేట శివారులోని నల్లపోచమ్మ తల్లికి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగరరావు గురువారం మొక్కులు చెల్లించుకున్నారు. తలపై బోనం ఎత్తుకొని గ్రామస్తులతో కలిసి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. నల్లపోచమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మెట్‌పల్లి పట్టణాల మున్సిపల్ చైర్‌పర్సన్లు, కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండోల చైర్‌పర్సన్లు, నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఎంపీడీవోల అభినందన



జగిత్యాలజోన్: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా దావ వసంత నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పలువురు ఎంపీడీవోలు గురువారం ఆమెను కలిశారు. అభినందనలు తెలియజేశారు. కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. నాలుగేళ్లలో జిల్లా అభివృద్ధి పథంలో వెళ్లేందుకు అధికారులు పూర్తిస్థాయిలో సహకరించారని వసంత అన్నారు.

### స్థల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): మండలకేంద్రం శివారులోని ఎస్సారెస్పీ వరదకాలువ వద్ద కోరుట్లకు చెందిన షబానాబీ అనే మహిళను ఆమె భర్త జమీర్ ఈనెల 3న హత్యచేయగా.. మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి గురువారం ఘటన స్థలాన్ని పరిశీలించారు. వరదకాలువ పరిసర ప్రాంతంలో తిరిగి స్థానికులను వివరాలు అడిగారు. ఆయన వెంట కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఏఎస్సై ఎండీ అలీమొద్దీన్ ఉన్నారు.

### బైక్ దొంగల అరెస్ట్

మెట్‌పల్లి: ద్విచక్ర వాహనాలు అపహరిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన గడ్డం సాయిలు, అందె భార్గవ్ కొంతకాలంగా బైక్‌లు చోరీచేస్తున్నారు. ఈ మేరకు గురువారం వేంపేట్ రోడ్డులో ఇద్దరిని అరెస్ట్‌చేసి వారినుంచి మూడు వాహనాలు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

రాయికల్: మండలంలోని భూపతిపూర్ శివారులో గురువారం పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్సై అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని ఐదుగురు పరారయ్యారని ఎస్సై తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2,710 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# రైతన్నకు వెన్నుదన్నుగా మహిళలు

- 144 కేంద్రాల ద్వారా... రూ. 258 కోట్ల ధాన్యం కొనుగోలు
- కొనుగోలు చేసినందుకు మహిళలకు రూ. 4.02 కోట్ల కమీషన్



ధాన్యం కొనుగోలు ముగిసిన అనంతరం విజయ సంకేతం చూపుతున్న మహిళలు

జగిత్యాలఅగ్రికల్చర్: యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసే బాధ్యతను మహిళా సంఘాలు తమ భుజాన ఎత్తుకుని విజయం సాధించాయి. ఓవైపు మండే ఎండలు, మరోవైపు అకాల వర్షాలు ఉక్కిరిబిక్కిరి చేసినప్పటికీ, ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా మహిళలు ప్రయత్నించి శభాష్ అనిపించుకున్నారు. దీనికి తోడు, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించేందుకు ఇటు అధికారులు, అటు రైస్‌మిల్లర్లతో సమన్వయం చేసుకుంటూ, రైతులకు సకాలంలో డబ్బులు అందేలా కొనుగోలు రికార్డులు నిర్వహించి, రైతుల బ్యాంకుఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూశారు.

**144 కేంద్రాల నుంచి 12.56 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ...**

రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేందుకు ఐకేపీ మహిళలు జిల్లాలో 144 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా రూ. 258.77 కోట్ల విలువైన 12,56,942 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఎప్పటికప్పుడు రైతుల బ్యాంకు, ఆధార్, కొనుగోలు వివరాలను ట్యాబ్‌లో పొందుపరుస్తూ, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూశారు. ఇందులో, 11.79 లక్షల క్వింటాళ్ల గ్రేడ్-ఏ ధాన్యాన్ని కొనుగోలుచేసి, రైతులకు రూ.241.91 కోట్లు చెల్లించారు. 77,755 క్వింటాళ్ల సాధారణ ధాన్యం కొని రైతులకు రూ. 15.86 కోట్లు చెల్లించారు.

**మహిళలకు రూ. 4.02 కోట్లు కమీషన్...**

గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతుల తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, సివిల్ సప్‌లై సంస్థకు అప్పగించినందుకు క్వింటాల్‌కు రూ.32 కమీషన్ ఇస్తుంటారు. దీంతో మహిళా సంఘాలు పోటీపడి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండడంతో, మహిళలు అడిగిన చోటల్లా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కలెక్టర్ అనుమతి ఇస్తున్నారు. గడిచిన యాసంగి సీజన్‌లో కొనుగోలు చేసిన 12,56,942 క్వింటాళ్ల ధాన్యాన్నికి రూ . 4.02 కోట్ల కమీషన్ రానుంది. ప్రభుత్వం ఇచ్చే కమీషన్‌తో మహిళలు రకరకాల వ్యాపారాలు, తక్కువ వడ్డీకి మహిళలకు రుణాలు ఇస్తూ మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు. అయితే, కొనుగోలు చేసిన ధాన్యం పూర్తిస్థాయిలో సివిల్‌సప్‌లైకు అప్పగించినప్పటికీ, కమీషన్ మాత్రం ఏడాదికో, రెండేళ్లకో వస్తుండడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో కొనుగోలు సమయంలో పనిచేసే వారి జీతాలు నిర్వహణ ఇబ్బందిగా మారింది. సీజన్ పూర్తి కాగానే కమీషన్ డబ్బులు ఇవ్వాలని మహిళలు కోరుతున్నారు.

### ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు



మహిళలకు కొనుగోలు బాధ్యతలు అప్పగించడంతో ఇబ్బంది లేకుండా కొనుగోలు చేశారు. సంచులు తెప్పించడంలో, లారీలు రాకపోతే యజమానులతో మాట్లాడారు. లారీలు అన్‌లోడ్ చేసుకోకపోతే రైస్‌మిల్లర్లతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.

– రాంకిషన్, వెల్దుర్తి, జగిత్యాల(మం)

### సీరియల్ ప్రకారం కొనుగోళ్లు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన రైతులకు సీరియల్‌నంబర్ ఇస్తూ కొనుగోలు చేయడంలో ఏ సమస్య రాలేదు. ఆ నెంబర్ ప్రకారం ధాన్యంలో తేమలేకుండా ఉంటే తూకం వేసి, రైస్‌మిల్లుకు పంపించాం. పదేళ్ల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ప్రతీ సీజన్‌లో జిల్లాలో ఒక్కో సంఘానికి లక్షల్లో కమీషన్ వస్తోంది.

– కుందారపు లావణ్య, లక్ష్మీపూర్ కేంద్రం, నిర్వాహకురాలు

### ఆర్థిక పరిపుష్టి సాధించేందుకే బాధ్యతలు



జిల్లాలో ప్రతి సీజన్‌లో కనీసం 140కు తగ్గకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసినందుకు మహిళలకు రూ.4–5 కోట్ల వరకు కమీషన్ వస్తోంది. దీంతో మహిళా సంఘాలు కొనుగోళ్ల ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు.

– లక్ష్మీనారాయణ , డీఆర్‌డీఏ పీడీ, జగిత్యాల

### విజేతలకు ట్రోఫీ అందజేత



సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలైన జట్టు సభ్యులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారయణరావు, జిల్లా నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎడమల శైలేందర్‌రెడ్డి, చిలుకమర్రి మదన్‌మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు మ్యాడ జనార్దన్, పార్టీ ప్రధానకార్యదర్శి ఆడెపు రమేశ్, దూట నరేందర్, పెండ్యాల ప్రతాప్, కంది రమేశ్, సముద్రాల రాజశేఖర్, రంగు వంశీ, బుస సత్యం తదితరులు పాల్గొన్నారు.

### రమణకు పరామర్శల వెల్లువ



జగిత్యాల: కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణ తండ్రి ఎల్లీరామ్ రెండు రోజుల క్రితం మృతిచెందగా గురువారం బీఆర్‌ఎస్ ప్రముఖులు పరామర్శించారు. వరంగల్ మేయర్ గుండుసుధారాణి, సిరిసిల్ల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆగయ్య, కరీంనగర్ జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కరీంనగర్ సుడా చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, నిజామాబాద్ అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, వివిధ నాయకులు కలిసి పరామర్శించారు.

# యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకం



నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పాత్ర కీలకమని, రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు సూచనల మేరకు రాయికల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బద్దం సుధీర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా బత్తిని నాగరాజును నియమించారు. ఈమేరకు గురువారం స్థానిక ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ వారికి నియామకపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు తదితరులు పాల్గొన్నారు.

**కుల సంఘాలకు నిధులు**

జగిత్యాలరూరల్: కుల సంఘ భవన నిర్మాణాలకు ప్రత్యేక నిధులు వెచ్చిస్తున్నామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మోతె గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన ఎస్టీ కమ్యూనిటీ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. సర్పంచ్ సురకంటి స్వప్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్, నాయకులు భగవంతం, మల్లారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

**మల్యాల నుంచే రాజకీయ జీవితం ప్రారంభం**

మల్యాల(చొప్పదండి): మల్యాల పంచాయతీ సమితి అధ్యక్షుడిగా రాజకీయ జీవితం ప్రారంభించానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. తమ కుల సంఘ భవనం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని నూకపల్లి మాల సంఘం నాయకులు జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన సానుకూలంగా స్పందించారు. నాయకులు రాజ గంగనర్సయ్య, చెలుముల రాజలింగం, ఉమ్మడి శంకర్, రాజ జలం, సుద్దాల నర్సయ్య, చెలిమెల భూమేశ్, మ్యాకల నర్సయ్య, సుద్దాల రతన్ సుద్దాల మహేశ్, రాజ గంగన్న, మ్యాకల లక్పతి పాల్గొన్నారు.

### ధర్మపురిలో పట్టపగలు చోరీ



ధర్మపురి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలు ఇంటి తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం, నగదు దోచుకెళ్లిన ఘటన ధర్మపురి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాయిల్ల రవికుమార్ అనే వ్యక్తి ధర్మపురిలోని బ్రాహ్మణ వీధిలో భార్య పిల్లలతో ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. నిత్యం కొబ్బరికాయలు అమ్మి జీవనోపాధి పొందుతున్నాడు. రోజు వారి లాగే గురువారం కొబ్బరికాయలు అమ్మేందుకు భార్యతో కలిసి దుకాణంకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఇంటికి తాళంవేసి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాలోని వస్తువులను చిందర వందరగా చేసి బంగారం, నగదు దొంగిలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై దత్తాద్రి ఆధ్వర్యంలో క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి దొంగతనంపై ఆరా తీశారు. చోరీకి గురైన వాటిలో మూడున్నర తులాల బంగారం చైన్‌లు, కమ్మలు, ముక్కుపుడకలతో పాటు రూ.2వేల నగదు ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### హైదరాబాద్‌లో చెర్లకొండాపూర్ వాసి మృతి



రాజు(ఫైల్)

మెట్‌పల్లి: మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన పడిగెల రాజు(19) యువకుడు హైదరాబాద్‌లో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నగేశ్ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా వీరిలో రెండో కుమారుడైన రాజు స్థానికంగా పదోతరగతి పూర్తిచేశాడు. ఉపాధికోసం హైదరాబాద్‌లో తన స్నేహితుల వద్దకు బుధవారం వెళ్లాడు. అదేరోజు రాత్రి స్నేహితులు ఉంటున్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

### రెండు కార్లు, ఆటోట్రాలీ ఢీకొని గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ శివారులోని ధర్మపురి రోడ్డులో రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద గురువారం సాయంత్రం రెండుకార్లు, ఆటో ట్రాలీ ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. ధర్మపురి నుంచి జగిత్యాలకు వస్తున్న కారు ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొనడంతో వెనుక నుంచి వస్తున్న ఆటో ట్రాలీ కూడా ముందు వెళ్తున్న కారును ఢీకొంది. దీంతో రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద సుమారు అరగంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానికులు గాయపడిన వారిని ప్రైవేటు వాహనాల్లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో రెండు కార్లతో పాటు, ఆటో ట్రాలీ నుజ్జునుజ్జు అయింది.

### రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కథలాపూర్: బీమారం మండలం కమ్మరిపేటకు చెందిన ఖమ్మం నర్సయ్య రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలపాలైనట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. నర్సయ్య బుధవారం రాత్రి బీమారం నుంచి కమ్మరిపేటకు బైక్‌పై వెళ్తుండగా బైకు అదుపుతప్పి కిందపడినట్లు పేర్కొన్నారు. తలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్సకు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించినట్లు గ్రామస్తులు తెలిపారు.

# విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

- నారుమడి సాగుబాటు చేసేందుకు వెళ్లి మృత్యువాత



శ్రీనివాస్ (ఫైల్)



శ్రీనివాస్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన కనక శ్రీనివాస్ (19) గురువారం తన పొలం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్‌చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ ఉదయం పొలం వద్ద నారుమడి సాగుచేసేందుకు వెళ్లాడు. ఈక్రమంలో విద్యుత్ మోటార్ నుంచి నీళ్లు రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ బంద్‌చేసి విద్యుత్ మోటార్‌కు మరమ్మతులు చేశాడు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్ మేయిన్ ఆన్‌చేసేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. కొంతసేపటికి తేరుకున్న శ్రీనివాస్ నడుచుకుంటూ వెళ్తుండగా నోటి నుంచి అధిక రక్తస్రావమై అక్కడే కుప్పకూలాడు. గమనించిన రైతులు స్థానికంగా ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లి వైద్యం చేస్తుండగా మృతిచెందాడు.. మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**తండ్రి, అన్నగల్ఫ్.. అమ్మకు చేదోడు వాదోడుగా..**

మృతుడు శ్రీనివాస్ తండ్రి రాజేశం, అన్న రంజిత్ జీవనోపాధికి గల్ఫ్‌బాట పట్టారు. తల్లి శంకరమ్మ కూలి పనులు చేస్తూ వారికున్న 20 గుంటల భూమిలో వరిసాగుచేస్తున్నారు. జగిత్యాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న శ్రీనివాస్ తీరిక సమయాల్లో వ్యవసాయం చేస్తుంటాడు. తమ్ముడు యశ్వంత్ 9వ తరగతి చదువుతున్నాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ..

- కూతురిని ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు తీసుకెళ్తుండగా ఘటన ..



లత(ఫైల్)

సారంగాపూర్: మండలకేంద్రంలోని అటవీప్రాంతంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్ల లత (37) మృతిచెందింది. ఎస్సై తిరుపతి, గ్రామస్తుల వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామానికి చెందిన నల్ల లత తన భర్త సత్యంరెడ్డితో కలిసి బైక్‌పై కూతురు సాహిత్యకు ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి కరీంనగర్ వెళ్తున్నారు. సాహిత్య మరో బైక్‌పై ముందు వెళ్తుండగా వెనుక లత, సత్యంరెడ్డి వస్తున్నారు. సారంగాపూర్ అటవీప్రాంతానికి చేరుకునే సరికి లతకు కళ్లు తిరిగి కిందపడడంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. దీంతో అక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్లిన లతను జగిత్యాలకు మరో వాహనంలో తరలిస్తుండగా అప్పటికే మృతిచెందింది. లత తల్లి యెల్ల లక్ష్మీ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి, మృతదేహంను పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**నెలరోజుల్లో ఇరాక్ ప్రయాణం...**

లత భర్త ఇప్పటికే గల్ఫ్ వెళ్లివచ్చాడు. మరో నెలరోజుల్లో ఇరాక్ వెళ్లేందుకు అవసరమైన డబ్బులు చెల్లించాడు. లతతో పాటు, భర్త సత్యంరెడ్డి తమకున్న ఐదేకరాల్లో వరి సాగుచేస్తున్నారు. వీరి చిన్నకూతురు అక్షిత ఇంటర్ చదువుతోంది. మృతురాలి అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# వీహెచ్‌పీ పట్టణాధ్యక్షుడిగా అరుణ్



సమావేశంలో వీహెచ్‌పీ నాయకులు

జగిత్యాలటౌన్: విశ్వహిందూ పరిషత్ పట్టణాధ్యక్షుడిగా జిట్టవేణి అరుణ్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్ ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాల జిల్లాకేంద్రంలో సమావేశం నిర్వహించిపట్టణాధ్యక్షుడిగా జిట్టవేణి అరుణ్‌కుమార్, నగర కార్యదర్శిగా గణపతి నరేందర్‌రాజును నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు సంస్థ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మామిడాల రాములు, నగర ఉపాధ్యక్షులు ముస్కరి ప్రశాంత్, గాజోజి సంతోష్ పాల్గొన్నారు.




### పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



పంచాయతీ కార్మికుల శిబిరంలో కాంగ్రెస్ నాయకులు

మల్యాల: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. మల్యాల మండలకేంద్రంలో దీక్ష చేపట్టిన పంచాయతీ కార్మికుల శిబిరాన్ని గురువారం సందర్శించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్, కంచర్ల లక్ష్మణాచారి, శనిగరపు తిరుపతి, వీర బత్తిని ప్రసాద్, సతీశ్‌రెడ్డి, శ్రీకోటి శ్రీకాంత్, మాజీ కోఆప్షన్ ఇమామ్, బత్తిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

### బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా తిరుమల వాసు



కోరుట్ల: పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఇందూరి తిరుమల వాసు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు గురువారం నియామక పత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన నిజామాబాద్ ఎంపీ అరవింద్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### సివిల్‌సర్వీస్ లాంగ్‌టర్మ్ కోచింగ్

జగిత్యాల: జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులు ఈ లాంగ్‌టర్మ్ ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్ ఉచిత శిక్షణకు ఈనెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జగిత్యాల వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయిబాబా తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, STUDYCIRCLE.CGG.GOV.INలో ఈనెల 16న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 31 నుంచి 2024 ఏప్రిల్ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉంటుందని, ఓయూ సెంటర్‌లో మొత్తం 150 సీట్లు ఉండగా, ప్రతిభ కనబర్చిన వారికి 50 నేరుగా, 100 ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. ప్రవేశం పొందిన వారికి రూ.5వేల విలువైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్, లైబ్రెరీ సౌకర్యం ఉంటుందన్నారు. వివరాలకు 040–27077929 సంప్రదించాలనికోరారు.

# ఆదాయం పెంచే మార్గాలపై పరిశోధన

- వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఎం.రఘునందన్‌రావు సూచన



రైతువేదికలో రైతులతో వైస్ చాన్స్‌లర్ రఘునందన్

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులకు ఆదాయం పెంచే మార్గాలపై వ్యవసాయ పరిశోధన స్థానాల్లో పరిశోధనలు సాగాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఎం.రఘునందన్‌రావు సూచించారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానాన్ని గురువారం ఆయన సందర్శించారు. పరిశోధనల గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, అధిక దిగుబడినిచ్చే, పురుగులు, తెగుళ్లు తట్టుకునే విత్తనాలపై విస్తృతంగా పరిశోధనలు చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల చెంతకు తీసుకెళ్లాలని సూచించారు. శాస్త్రవేత్తలు పరిశోధనలతోపాటు, గ్రామాలను సందర్శించి రైతులకు చేదోడు వాదోడుగా ఉండాలని కోరారు. రిజిస్ట్రార్ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ, ప్రతీశాస్త్రవేత్త అకుంఠిత దీక్షతో పనిచేస్తే పరిశోధన స్థానంతోపాటు, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పేరుప్రఖ్యాతలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా పరిశోధన స్థానం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దేవయ్య, పురుషోత్తంతో బడ్జెట్ విషయాలపై చర్చించి వివరించారు. పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

**సాగుపై చైతన్యపర్చాలి**

మల్యాల(చొప్పదండి): పంటలు పండించడంలో రైతులను చైతన్యపర్చాలని, సాంకేతికతపై మరింత అవగాహన కల్పించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ రఘునందన్ సూచించారు. స్థానిక రైతువేదికలో జిల్లాలోని వ్యవసాయాధికారులతో వ్యవసాయ కమిషనర్ సమావేశం నిర్వహించారు. రైతుబంధు, రైతుబీమా పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. సాగు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్, ఏడీఏ రమేశ్, రామచంద్రం, కల్పన, ఏవో చంద్రదీపక్, జ్యోతి, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

### కోరుట్ల రామాలయంలో చోరీ



కోరుట్ల: పట్టణ శివారు పూల్‌వాగు తీరానఉన్న సీతారామ ఆలయంలో బుధవారం చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. దొంగలు ఆలయ గర్భగుడి ద్వారం తాళం పగుల గొట్టి లోనికి ప్రవేశించారు. ఉత్సవమూర్తులపై ఉన్న ఆభరణాలు, పుస్తె, మెట్టెలు, హుండీలోని నగదు అపహరించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నారు.